# సుపుత్రుడు

రాత్రి పదకొండుంపావు.

హోటల్ షెరాటన్‌కి కొద్దిదూరంలో వో జీపు ఆగివుంది. అందులో స్టీరింగువీల్ ముందు ఒకతను వెనకాలసీట్లో ఇద్దరు కూర్చుని వున్నారు. ముగ్గురి చేతుల్లో వెలిగే సిగరెట్లు, జేబుల్లో తాళ్ళు వున్నాయి. కోదండం కోసం ఎదురుచూస్తున్నారు.

హోటల్ షెరాటన్‌లో తన గరల్ ఫ్రెండ్‌తో డిన్నర్ తీసుకుంటు న్నాడు కోదండం. ఇరవై రెండేళ్ళ కోదండం హైద్రాబాద్‌లోని పారిశ్రామికవేత్త అభిరామం ఏకైక ముద్దుల కొడుకు.

కోదండం తల్లి చిన్నప్పుడే మరణించింది. అతను పుట్టినప్పటి నుంచే నష్టాల్లో వున్న అభిరామం వ్యాపారం అభివృద్ధి అవసాగింది. తల్లి లేని బిడ్డని తన అదృష్టానికి కారణమనే నమ్మకంతో అభిరామం కోదండాన్ని అల్లారు ముద్దుగా పెంచాడు. సవతితల్లి రాకూడదని మళ్ళీ పెళ్ళి కూడా చేసుకోలేదు.

అభిరామానికి ముప్పయి ఏడు లిమిటెడ్ కంపెనీలున్నాయి. అన్నిటిలో కోదండం బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడు వారానికి కనీసం రెండు మూడు బోర్డు మీటింగ్సుకి కోదండం హాజరవాలి.

మిగతా డైరెక్టర్లంతా బాగా చదువుకున్నవాళ్ళు. కోదండం వాళ్ళ ముందు ధనంలో తప్ప మిగతా అన్నివిషయాల్లో తక్కువే.

జీప్‌లో నిరీక్షిస్తున్న ఆ ముగ్గురు హైదరాబాద్‌లో పేరుమోసిన గూండాలు. మిట్ట మధ్యాహ్నం అందరూ చూస్తుండగా పదిమందిని పొడిచి చంపేసి, ఏం కానట్లు నడిచి వెళ్ళగల గుండె దిటవు గలవాళ్లు. ఆ ముగ్గురు రౌడీలు.

చిట్టచివరికి కోదండం తన గరల్ ఫ్రెండ్తో బయటికి వచ్చాడు. అతని ప్లిమత్ కారు జీపు పక్కనుంచి బంజారాహిల్స్ వైపు వెళ్ళగానే జీప్‌ని స్టార్టు చేసాడు రౌడీ.

క్షణాలలో జీపు వేగం అందుకుంది. నిమిషంలో ప్లిమత్‌ని దాటింది జీపు రోడ్డుకు అడ్డంగా ఆపారు. విధిలేక కోదండం తను నడిపే ప్లిమత్‌ని ఆపాడు. జీపులోంచి ముగ్గురూ మెరుపులా అతని మీదికి దూకి ముక్కు మీద క్లోరోఫాం తడిపిన బట్టని అదిమారు. స్పృహతప్పిన కోదండాన్ని జీపులో వేసుకొని పారిపోయారు. నిశ్చేష్టురాలై చూస్తూండి పోయింది కోదండం గరల్ ఫ్రెండ్.

* * *

ఫోన్ మోగింది, అభిరామం ఫోన్ అందుకొని తన పేరు చెప్పాడు.

"నా పేరు నాగులు." కంగారుగా వినిపించిందో కంఠం.

మీ అబ్బాయి మా చేతుల్లో వున్నాడు, పదివేలు ఇస్తే తెచ్చి మీకు అప్పగిస్తాం."

"గుడ్! వెంటనే రండి పని పూర్తయిందా?"

అరగంట తర్వాత జీపులోంచి ముగ్గురు రౌడీలు కోందండాన్ని ఇంట్లోకి తీసుకువెళ్ళాడు.

హిప్పీ జుట్టు మాయమయి మామూలు క్రాప్ ఆ స్థానంలో ఉంది. పొడుగ్గా పెరిగిన గడ్డం, మీసాలులేవు. సన్నగా గీసి వుంది.

తృప్తిగా తలాడించి ఆ ముగ్గురికి పదివేల రూపాయలు ఇచ్చాడు అభిరామం.

"ఎంతచెప్పినా ఈ వెధవ క్షవరం చేయించుకోడు." చెప్పాడు అభిరామం వాళ్ళతో.

"సరిగ్గా రెండు నెలల తరువాత కనబడతాం" చెప్పాడు ఆ ముగ్గురు రౌడీలలో ఒకడు.